క్లుప్తంగా

తాగునీటి కోసం స్పెషల్ డ్రైవ్



కార్యదర్శి సరితతో మాట్లాడుతున్న అంగద్

మునిపల్లి(అందోల్): ప్రజల తాగునీటి సౌకర్యం కోసం ఆయా గ్రామాల్లో పర్యటించనున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అంగద్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని పెద్దచల్మెడ, మన్‌సాన్‌పల్లి, తాటిపల్లి గ్రామాల్లో పర్యటించినట్లు తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో 101 చేతి పంపులు, సింగల్ ఫేస్ మోటార్లు 179, త్రీఫేస్ మోటార్లు 33 ఉన్నాయన్నారు. వాటిలో అన్ని పని చేస్తున్నాయని, ఏదైనా రిపేరుకు వస్తే వెంటనే మరమ్మతులు చేయిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 10 వరకు ఆయా గ్రామాల్లో ఎన్ని బోర్లు పని చేస్తున్నాయనే వివరాలను తెలుసుకునేందుకు జిల్లా అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. అందుకు ఆయా గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సరిత, వ్యవసాయ విస్తరణ అధికారి లావణ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

మా వారసులకు ఉద్యోగాలు ఇవ్వండి



కలెక్టరేట్ కార్యాలయంలో సిబ్బందికి వినతి పత్రం ఇస్తున్న వీఆర్‌ఏలు

సంగారెడ్డి జోన్: వీఆర్‌ఏల సమస్యలను తక్షణమే పరిష్కరించి, తమ వారసులకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. గురువారం సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట వీఆర్‌ఏలు, కుటుంబ సభ్యులు, సంఘాల నేతలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వీఆర్‌ఏల సమస్యల పరిష్కారానికి కమిటీ వేసి సంవత్సరం పూర్తి కావస్తున్నా.. ఇంకా పరిష్కారం కాలేదని అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వీఆర్‌ఏ వారసులకు ఉద్యోగాలు ఇవ్వకుండా ఎందుకు నిర్లక్ష్యం చేస్తుందని ప్రశ్నించారు. ఉద్యోగాలు ఇవ్వాలని మంత్రిని కలిసేందుకు వెళితే అరెస్టులు చేయటం బాధాకరమన్నారు.

ప్లాస్టిక్ వాడకం తగ్గించాలి

రిటైర్డ్ ఐఎఫ్‌ఎస్ అధికారి డాక్టర్ రఘువీర్



మాట్లాడుతున్న రఘువీర్ తదితరులు

సదాశివపేట(సంగారెడ్డి): ప్రతి విద్యార్థి సామాజిక బాధ్యతగా పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని రిటైర్డ్ ఐఎఫ్‌ఎస్ అధికారి డాక్టర్ రఘువీర్ పేర్కొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం తరుణి సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్లాస్టిక్, బాల్య వివాహాలు అరికట్టడం అనాథ పిల్లలను చేరదిసి విద్యనందించడంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వాడకం, వేస్టేజీను తగ్గించాలన్నారు. తరుణి సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ మమత మాట్లాడుతూ.. బాల్య వివాహాలు అరికట్టి బాలికలకు రక్షణ కల్పించడం, అనాథ పిల్లలను చెరదీసి వారికి విద్యా అందించడం వంటి కార్యక్రమాలు చేస్తున్నామని వివరించారు. అలాగే, కళాశాల ప్రిన్సిపాల్ భారతి మాట్లాడుతూ.. తరణి సంస్థ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించి సమాజాభివృద్ధికి పాటుపడడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ సిద్దులు, డాక్టర్ మురళీకృష్ణ, సర్వయ్య, శకుంతల, సావిద్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభించిన నగేష్ షెట్కార్

నారాయణఖేడ్: వేసవి కాలం రాక ముందే ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని ఉమ్మడి మెదక్ జిల్లా జెడ్పీ ప్రణాళిక సంఘం మాజీ సభ్యుడు నగేష్ షెట్కార్ కోరారు. ఖేడ్ పట్టణంలోని రాజీవ్‌చౌక్ సమీపంలో స్థానిక ముస్లిం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలు, ప్రయాణికుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. స్వచ్ఛంద సంస్థలు చలివేంద్రాల ఏర్పాటుకు ముందుకు రావాలని కోరారు. నాయకులు విఠల్‌రెడ్డి, బక్షిరాం, సాయిలుపటేల్, పురంజన్, మారుతినాయక్, తౌసీఫ్, ఫయాజ్, బసిరెడ్డి పాల్గొన్నారు.

దిగుబడికి కీలకం.. నీటి యాజమాన్యం

- బోరుబావులు, వాగులు, చెరువు నీటితో పంట సాగు
- జిల్లాలో 89,366 వేల ఎకరాలలో ఆరుతడి పంటలు

మునిపల్లి(అందోల్): ఆరుతడి పంటలకు సకాలంలో నీరందిస్తే అధిక దిగుబడి సాధించవచ్చు. జిల్లాలో 89,366 ఎకరాలలో రైతులు బోరుబావులు, చెరువునీటితో ఆరుతడి పంటలు మిరప, వేరుశనగ, మొక్కజొన్న, జొన్న, ఉల్లిగడ్డ, పూల తోటలు, శనగ, వివిధ రకాల కూరగాయల పంటలను సాగు చేస్తున్నారు. కొందరు రైతులు పంటలను బట్టి స్పింకర్లు, పైపులైన్ సహకారంతో నీరందిస్తున్నారు. ఆరుతడి పంటలకు సరైన సమయంలో నీటి యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించడానికి అవకాశం ఉంటుంది. రైతులు పూత దశలో అప్రమత్తంగా వ్యవహరించి నీటి ఎద్దడికి గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. గింజ, కాయ పట్టే దశలో నీటిని అందించాలి. పంట తీసే సమయంలో 15 నుంచి 28 రోజుల లోపు నీరందించాలి. నీటి పారకం ద్వారా కాకుండా మొక్కల మొదట్లో నీరందిస్తే వేర్లకు తొందరగా నీరు చేరుతుంది. రైతులు ఆధునిక పద్ధతిలో పంటలు సాగు చేస్తే ఆర్థిక ప్రగతి సాధిస్తారు. ఎప్పటికప్పుడు వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటించి సస్యరక్షణ చేపట్టాలి.



మిరప పంటకు నీరు అందిస్తున్న రైతు

మిర్చి ఎకరాకు 10 క్వింటాళ్లు

సరైన సమయంలో మిర్చి పంటకు నీరందిస్తే ఎకరాకు 10 క్వింటాళ్లు వరకు దిగుబడి వస్తుంది. మిర్చి తెంపడానికి కిలోకు రూ.15 చొప్పున కూలీ డబ్బులు ఇస్తారు. ఒక్కో వ్యక్తి రోజుకు 30–40 కిలోల వరకు మిర్చి తెంపుతున్నారు. ఆరుతడి పంటలకు ప్రభుత్వం సబ్సిడీపై రుణాలు మంజూరు చేయాలి.



–బోయిని పవన్, ఎటిగడ్డ సంగ్యం

ఆరుతడి పంటలే మేలు

జిల్లాలో 89,366 ఎకరాల్లో రైతులు వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. మిర్చి, చెరకు, వేరు శనగ, కంది, జొన్న పంటలతో పాటు వివిధ రకాల కూరగాయలు సాగవుతున్నాయి. వ్యవయసాయ విస్తరణ అధికారులు పంటల సర్వే నిర్వహిస్తున్నారు.



–శివప్రసాద్ ,జిల్లా వ్యవసాయాధికారి

అన్యాయం జరిగితే సహించం

జహీరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేస్తే సహించబోమని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై.నరోత్తం అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన కులగణన తప్పుల తడకగా ఉందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో బీసీ రిజర్వేషన్లు పెంచుతామని, ఓట్లను దండుకుని అధికారంలోకి వచ్చి మోసం చేశారని మండిపడ్డారు. అన్ని వర్గాల జనాభా తగ్గినట్లు, ఒక వర్గం జనాభా మాత్రమే పెరిగినట్లు చూపుతోందని పేర్కొన్నారు. బీసీల్లో ఉన్న ప్రతి కులం జనాభా ఎంత ఉందో లెక్కలతో సహా వెల్లడించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు నర్సింహులు, విఠల్, ధర్మవార్ పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న నరోత్తం

చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలి



బిడెకన్నెలో పాత పంటల జాతర

ఝరాసంగం(జహీరాబాద్): చిరుధాన్యాలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం మద్దతు ధర కల్పించి ప్రోత్సహించాలని డీడీఎస్ ప్రతినిధి వినయ్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని బిడెకన్నె గ్రామంలో పాత పంటల జాతరను నిర్వహించారు. గ్రామానికి వచ్చిన జాతర సభ్యులకు రైతులు, ప్రజలు డప్పు చప్పుళ్లతో ఘనంగా స్వాగతం పలికారు. చిరుధాన్యాలతో అలంకరించిన ఎడ్లబండ్లను ఊరేగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో వాణిజ్య పంటలు అధికమై చిరుధాన్యాల సాగు తక్కువ అవుతుందన్నారు. మట్టి పరీక్షలు చేయించుకుని ఫలితాలకు అనుగుణంగా సేంద్రియ ఎరువులతో పంటలు సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీడీఎస్–కేవీకె శాస్త్రవేత్త రమేష్, జాతర కోఆర్డినేటర్లు, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

బీసీ కులగణన చరిత్రాత్మకం

కాంగ్రెస్ నేత నీలం మధు

పటాన్‌చెరు: దేశంలో ఎక్కడ లేని విధంగా జనాభా ప్రాతిపదికన బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన బీసీ కులగణన చారిత్రాత్మకమని కాంగ్రెస్ నేత నీలం మధు అన్నారు. గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందించి ధన్యవాదాలు తెలిపారు. నీలం మధు మాట్లాడుతూ.. దశాబ్దాలుగా బీసీల్లో రాజకీయ చైతన్యం ఉన్నా చాలామంది బీసీలు నాయకులుగా ఎదగలేకపోయారని అన్నారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఒక బృహత్ సంకల్పంతో కులగణన చేపట్టి దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం పెంచే దిశగా అసెంబ్లీలో నిర్ణయం తీసుకోవడంపై సీఎం, రాష్ట్ర మంత్రులు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

మత్స్యకారులను ప్రత్యేకంగా పరిగణించండి

పటాన్‌చెరు టౌన్: మత్స్యకారులను ప్రత్యేకంగా పరిగణించాలని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ పేర్కొన్నారు. గురువారం ఇస్నాపూర్ మత్స్యకారులతో కలిసి దేవాదాయ, ఎన్విరాన్‌మెంట్ శాఖ మంత్రి కొండా సురేఖను కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం ఈనెల 8న జిన్నారం మండలం కొడకంచి ఆదినారాయణ స్వామి జాతర, 21న ఇస్నాపూర్ పెద్దమ్మతల్లి విగ్రహప్రతిష్ఠ కార్యక్రమాలకు హాజరుకావాలని ఆహ్వానించారు. మధు మాట్లాడుతూ... పాశమైలారం పారిశ్రామికవాడలో వెలువడుతున్న కాలుష్యం కారణంగా చెరువులు విషపూరితంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమల వ్యర్థ జలాలు చెరువులో కలవడం వల్ల చేప పిల్లలు మృత్యువాత పడుతున్నాయన్నారు. కొన్ని చెరువులు చేపల పెంపకానికి అనువుగా లేకపోవడంతో మత్స్యకార సభ్యులకు సొసైటీలో సభ్యత్వం కల్పించే విషయంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని విన్నవించారు. దీంతో సానుకూలంగా స్పందించిన మంత్రి సురేఖ విజ్ఞప్తి పత్రంపై వెంటనే సంతకం చేసి పీసీబీ అధికారులు విచారణ జరిపి నివేదిక ఇవ్వాల్సిందిగా ఆదేశాలిచ్చారు.



సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మధు

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

సంగారెడ్డి క్రైమ్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జైలు శిక్ష, జరిమానా విధించిన సంఘటన సంగారెడ్డి పట్టణ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ సుమన్‌కుమార్ కథనం ప్రకారం.. బుధవారం అర్ధరాత్రి సంగారెడ్డి జాతీయ రహదారిపై, పాత బస్టాండ్ వద్ద నిర్వహించిన తనిఖీల్లో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని గురువారం కోర్టులో హాజరుపరచగా జిల్లా అదనపు న్యాయమూర్తి షకీల్ అహ్మద్ సిద్దిఖీ ఒకరికి రెండు రోజులు జైలుశిక్ష, రూ.2000 జరిమానా, మిగతా ముగ్గురికి రూ.2000, ఒకరికి రూ.1000 చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ వివరాల ప్రకారం.. బుధవారం నిర్వహించిన తనిఖీల్లో 16 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని గురువారం కోర్టులో హాజరుపరచగా 14 మందికి రూ.2 వేలు, మరో ఇద్దరికి రూ.1000 చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

మల్లన్న జాతరకు సర్వం సిద్ధం

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని మల్లన్న బస్తీలో నిర్వహించే మల్లికార్జున స్వామి జాతరకు సర్వం సిద్ధం చేశారు. శనివారం నుంచి మూడు రోజుల పాటు సాగే బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు కాంగ్రెస్ సీనియర్ నాయకులు చంద్రారెడ్డి తెలిపారు. మొదటిరోజు గంగపటం, రెండవ రోజు కల్యాణం, మూడవరోజు నాగవెల్లి కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

నిధులు మంజూరు చేయండి



కమిషనర్‌తో మాట్లాడుతున్న పుష్ప

రామచంద్రాపురం (పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ అభివృద్ధికి నిధులను మంజూరు చేయాలని గురువారం జీహెచ్‌ఎంపీ కమిషనర్ కె.ఇలంబర్తిను కార్పొరేటర్ పుష్ప కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని సమస్యలను కమిషనర్ దృష్టికి తెచ్చినట్లు చెప్పారు. సీసీ రోడ్లు, అభివృద్ధి పనులకు నిధులను మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. అలాగే, రామచంద్రాపురం డివిజన్‌లో ఒకసారి పర్యటించాలని కోరగా అందుకు ఆయన సానుకూలంగా స్పందించారని అన్నారు.

మహిళలకు సత్కారం

జహీరాబాద్: రథసప్తమిని పురస్కరించుకుని ముత్తయిదువులను సత్కరించారు. గురువారం రూపాలి ప్రకాష్ దేవగిరి ఆధ్వర్యంలో మహిళలకు పసుపు, కుంకుమ అందజేసి సత్కరించారు. అనంతరం లాటరీ పద్ధతిలో చిట్టీలు తీసి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రూప, కోమల్, స్వప్న, రేష్మ, లక్ష్మి పాల్గొన్నారు.

అట్టహాసంగా ఫుడ్‌ఫెస్టివల్

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని వశిష్ఠ డిగ్రీ కళాశాలలో ఫుడ్ ఫెస్టివల్ అట్టహాసంగా నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన పలు రకాల వంటకాలను ప్రదర్శించారు.ప్రిన్సిపల్ డాక్టర్ సిద్ధారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ మారుతిరావు, డైరెక్టర్లు అమర్‌నాథ్, సంజీవ్‌రావు, శంకర్‌రావు వంటల రుచి చూసి ప్రశంసించారు.

అంగన్‌వాడీకి భవనం కేటాయింపు

జహీరాబాద్ టౌన్: నిరుపయోగంగా ఉన్న భవనాన్ని తహసీల్దార్ ఆదేశాల మేరకు అంగన్‌వాడీ కేంద్రానికి కేటాయించారు. మండలంలోని శేఖాపూర్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో కొన్ని సంవత్సరాల క్రితం ప్రభుత్వ నిధులతో భవనాన్ని నిర్మించారు. మిగులు పనులు చేపట్టని కారణంగా భవనం నిరుపయోగంగా మారింది. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి తహసీల్దార్, మండల ప్రత్యేక అధికారి రవీందర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ భవనాన్ని అంగన్‌వాడీకి కేంద్రానికి ఇస్తే వినియోగంలోకి వస్తుందని ఆమె పేర్కొన్నారు. స్పందించిన తహసీల్దార్ గురువారం ఆర్ఐ యాదలాల్‌ను గ్రామానికి పంపించారు. ఆయన గ్రామాన్ని సందర్శించి నిరుపయోగంగా భవనాన్ని పరిశీలించారు. భవనం తాళం చెవిని ఆర్ఐ టీచర్ పుణ్యమ్మకు అందజేశారు. శుభ్రం చేసి భవనంలో అంగన్‌వాడీ కేంద్రం నడుపుకోవాలని సూచించారు.



తాళం చెవిని టీచర్‌కు ఇస్తున్న ఆర్ఐ

డంపింగ్‌యార్డులో అగ్ని ప్రమాదం



మంటలను ఆర్పుతున్న సిబ్బంది

నారాయణఖేడ్: పట్టణ శివారులోని మున్సిపాలిటీకి చెందిన డంపింగ్ యార్డులో గురువారం అగ్ని ప్రమాదం సంభవించింది. మంటలు భారీ ఎత్తున వ్యాపించాయి. దీంతో డంపింగ్ యార్డు చుట్టూ ప్రక్కల ప్రాంతాల్లో దట్టంగా పొగ అలుముకుంది. స్థానికులకు ఫైర్ ఇంజన్‌కు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకొని ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు.

శిథిలావస్థలో భవనం





సంగారెడ్డి జిల్లా కలబ్గూర్ శివారులోని మంజీరా బ్యారేజ్ వాటర్ సప్లై అధికారుల కార్యాలయం శిథిలావస్థకు చేరింది. భవనం పాములకు నిలయంగా మారింది. గోడలన్నీ పగుళ్లు ఏర్పడి, కిటికీలు, తలుపులు విరిగిపోయాయి. గోడలపై చెట్లు పెరుగుతున్నాయి. భవనం పూర్తిగా పాడవడంతో సిబ్బంది భయపడుతున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

ఘనంగా స్వయం పాలన దినోత్సవం

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలంలోని. ధనసిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలను బోధించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌గా ప్రేమ్‌కుమార్, జిల్లా విద్యాధికారిగా సంగమేశ్వర్, ఎంఈఓగా అభిషేక్, హెచ్‌ఎంగా దీపక, అటెండర్‌గా సిద్దార్థలు వ్యవహరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం.రమేష్‌కుమార్, ఉపాధ్యాయులు జితేందర్, మల్లయ్యస్వామి, దల్‌సింగ్, చంద్రశేఖర్, శామయ్య, సిద్దప్ప, మంజుల, మహేష్, సురేష్ కుమార్ విద్యార్థులను అభినందించారు.

విద్యార్థులే ఉపాధ్యాయులుగా..

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మండలంలోని నిజాంపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మరి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రతిభను కనబర్చిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజశ్రీ,ఉపాధ్యాయులు అశోక్,గిరిధర్,రమేష్, దుర్గాప్రసాద్,స్వరూపరాణి సుకన్య, మతీన సుల్తానా పాల్గొన్నారు.



ఉపాధ్యాయుల వేషధారణలో విద్యార్థులు

డ్రైవర్ సెలవుపై ఉంటే.. బస్సు రద్దు!



బస్సు కోసం ఎదురుచూస్తున్న టీచర్లు, ప్రజలు

జహీరాబాద్ టౌన్: ఆర్టీసీ అధికారుల వైఖరితో ఉపాధ్యాయులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. డ్రైవర్‌కు సెలవు ఉంటే బస్సు సర్వీసు రద్దు అవుతుంది. దీంతో పాఠశాలకు వెళ్లే టీచర్లకు ప్రత్యామ్నాయం లేక అవస్థలు పడుతున్నారు. జహీరాబాద్ డిపో నుంచి తాండూర్‌కు ప్రతి రోజు ఉదయం బస్సు సర్వీస్ నడుస్తుంది. ఈ రూట్‌లోని ఆయా గ్రామాల ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ప్రజలు ప్రతి రోజు ఇదే బస్సు ద్వారా రాకపోకలు సాగిస్తున్నారు. జహీరాబాద్-తాండూరు రూట్ సర్వీస్‌కు పర్మినెంట్‌గా ఒకే డ్రైవర్ విధులు నిర్వహిస్తున్నారు. ఆయన సెలవుపై ఉంటే ఆ రోజు బస్సు రాదు. దీంతో ఉపాధ్యాయులు పాఠశాలకు వెళ్లలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గురువారం డ్రైవర్ రాలేదని తాండూరుకు బస్సును రద్దు చేశారు. దీంతో ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయంగా మరో డ్రైవర్‌తో బస్సు నడపాలని డిపో అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి తాండూరు బస్సు రెగ్యులర్‌గా నడపాలని టీచర్లు, ప్రజలు కోరుతున్నారు.

అర్హతలేని టీచర్లతో బోధన..



ఆందోళన వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు



ప్రిన్సిపాల్‌తో వాగ్వాదం చేస్తున్న తల్లిదండ్రులు

జహీరాబాద్ టౌన్: అర్హతలేని టీచర్లతో పాఠాలు బోధిస్తున్నారంటూ పట్టణంలోని అల్లీపూర్ కృష్ణవేణి స్కూల్ వద్ద తల్లిదండ్రులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. పెద్ద సంఖ్యలో పాఠశాలకు వచ్చిన తల్లిదండ్రులు ప్రిన్సిపాల్‌తో వాగ్వివాదానికి దిగారు. ఇంటర్, డిగ్రీ చదివిన వారితో బోధన చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వేలకు వేలు ఫీజులు కడుతున్న విద్యా ప్రమాణాలు రోజురోజుకి పడిపోతున్నాయని విచారం వ్యక్తం చేశారు. విద్యాశాఖ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని, దీంతో తమ పిల్లల భవిష్యత్ దెబ్బతింటుందన్నారు. అర్హతలేని టీచర్లను తొలగించి బీహెడ్ చేసిన వారిని తీసుకోవాలని కోరారు. అర్హతలేని వారితో పాఠశాల నడుపుతున్న స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని ఏఎస్ఐఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దత్తురెడ్డి ఎంఈఓ బస్వరాజ్‌కు ఫిర్యాదు చేశారు.

సంక్షేమ పథకాలతో ప్రయోజనం



ఏడీ వెంకటరావుకు వినతిపత్రం ఇస్తున్న అశోక్

చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు వెంకటరావు

జోగిపేట (అందోల్): ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన చేనేత పొదుపు పథకం కార్మికులకు వరం లాంటిదని ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు వెంకటరావు అన్నారు. గురువారం స్థానిక చేనేత సహకార సంఘం కార్యాలయంలో అధ్యక్షుడు వర్కల అశోక్ అధ్యక్షతన చేనేత కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేనేత కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు సీఎం రేవంత్‌రెడ్డి అభయహస్తం, నేతన్న పొదుపు, నేతన్న భద్రత, భరోసా వంటి పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారన్నారు. కార్మికులు ఈ పథకాలలో చేరేందుకు ముందుకు రావాలని కోరారు. పథకాలకు సంబంధించిన మార్గదర్శకాలను కార్మికులకు వివరించారు. అనంతరం కార్మికులకు జియో ట్యాగ్ నంబర్లు ఇవ్వాలని చేనేత సహకార సంఘం చైర్మన్ వర్కల అశోక్ వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఉన్ని సహకార సంఘం చైర్మన్ కష్టయ్య, జౌళి శాఖ అధికారి లలిత, సంఘం సభ్యులు రాజేందర్, కార్మికులు పాల్గొన్నారు.